AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

కాలం చెల్లిన బస్సులతో అవస్థలు

2

2

అకాల వర్షం.. తడిసిన ధాన్యం..

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

అక్షరటుడే, బోధన్ : రక్తదానం ప్రాణదానమని.. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బోధన్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న సమయంలో రక్తదానం చేయడం ద్వారా ఓ విలువైన ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని ఏసీపీ పేర్కొన్నారు. బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై మశ్చేందర్‌రెడ్డి, రెడ్ క్రాస్‌సొసైటీ ప్రతినిధి తోట రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అక్షరటుడే, కామారెడ్డి: పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసులపై వేటు పడింది. భిక్కనూరు ఏఎస్సై నర్సయ్య, రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట్ రెడ్డిలను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఏఎస్సై నర్సయ్య గతంలో డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌లో పని చేసినప్పుడు ఒక పాస్‌పోర్టు దరఖాస్తుపై విచారణ చేపట్టాల్సిన సమయంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. వెంకట్ రెడ్డి కూడా డీఎస్‌బీ లో పనిచేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తుల పాస్‌పోర్టు దరఖాస్తు విచారణలో బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శించారు.

కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ..

క్రిమినల్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ నర్సయ్య, వెంకట్‌రెడ్డి ఇద్దరు ప్రాథమిక విచారణ చేయకుండానే ముగ్గురికి పాస్‌పోర్టు జారీ చేయడానికి క్లియరెన్స్ ఇచ్చారు. ఈ విషయం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర దృష్టికి రావడంతో విచారణ జరిపిన ఎస్పీ తన నివేదికను ఇన్‌ఛార్జి డీఐజీకి పంపించారు. నిర్లక్ష్యాన్ని సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారి ఇద్దరిని తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పెండింగ్ కేసులు క్లియర్ చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని సీపీ సాయిచైతన్య సూచించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో మంగళవారం నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో పారదర్శకంగా నేర పరిశోధన చేయాలని సూచించారు. కేసు నమోదు నుంచి ఛార్జిషీట్ వరకు ప్రతివిషయాన్ని కులంకశంగా పరిశోధన చేసి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో ఛార్జిషీటు దాఖాలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి అధికారికి సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీఐలు, ఎస్సైలు తదితరులున్నారు.

బాబ్లీకి వరద.. గేట్ల మూసివేత లేనట్టేనా..

అక్షరటుడే, బాల్కొండ : శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను అధికారికంగా అక్టోబర్ 28న మూసివేయాల్సి ఉంటుంది. కానీ బాబ్లీ ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. దీంతో గేట్ల మూసివేతపై సందిగ్ధత నెలకొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్టోబర్ 28వ తేదీ అర్ధరాత్రి త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో గేట్లను మూసివేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని అధికారికంగా మూసివేత నిర్ణయంపై సంతకాలు చేయనున్నారు. బాబ్లీ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఎక్కువగానే వస్తుండడంతో ఇప్పట్లో గేట్ల మూసివేత ఉండకపోవచ్చని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వరద సాయం అందేనా?

పరిశీలనలు తప్ప పైసా వచ్చింది లేదు

ఆగస్టులో భారీ వర్షాలకు ఆగమైన కామారెడ్డి

నిధులు విడుదల చేయని ప్రభుత్వాలు

> కామారెడ్డి జిల్లాకు వరద సాయంపై ప్రభుత్వాలు స్పందించడం లేదు. రెండు నెలల క్రితం భారీ వర్షాలకు జిల్లా ఆగమైంది. ఆగస్టులో కురిసిన వర్షంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో తీవ్ర నష్టం జరిగింది. కుండపోత వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు తెగిపోయాయి. చెరువులు, కుంటలకు గండ్లు పడ్డాయి. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అయినా.. ప్రభుత్వాలు మాత్రం వరద సాయం విడుదల చేయడం లేదు.
>
> – అక్షరటుడే, కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వరదలు చుట్టుముట్టాయి. ఆగస్టు 27న వినాయక చవితి రోజు కుండపోత వానతో జనజీవనం స్తంభించిపోయింది. కామారెడ్డి పట్టణంలో వందలాది ఇళ్లు నీట మునిగాయి. పలువురు వరదల్లో కొట్టుకుపోయారు. రహదారులు తెగిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. జిల్లా కేంద్రానికి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. జాతీయ రహదారి దెబ్బతింది. ఇప్పటికీ పలు ప్రాంతాలకు బస్సులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

పరిశీలనలకే పరిమితమా..

కామారెడ్డికి వరదలు రావడం ఎప్పుడూ చూసింది లేదు. అలాంటిది ఒక్కసారిగా వచ్చిన వరదలతో అంతా తుడిచిపెట్టుకు పోయింది. రోడ్లు, చెరువులు, కుంటలు, ఇళ్లు కొట్టుకుపోయాయి. రెండు రోజుల పాటు ప్రజలు నరకం అనుభవించారు. దాంతో సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా వరద ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఆగస్ట్ 28న కామారెడ్డికి వచ్చి వరద ప్రాంతాలను పరిశీలించి అధికారులతో సమీక్ష చేపట్టారు. అదే నెల 31న నలుగురు ఎమ్మెల్సీల బృందం పర్యటించి ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని సీఎంకు నివేదిస్తామని ప్రకటించింది. సెప్టెంబర్ 3న స్వయంగా సీఎం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించి వరద బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు.

రూ.350 కోట్లకు పైగా నష్టం

కామారెడ్డి వరద సాయంపై దాదాపుగా ప్రజలు ఆశలు వదులుకున్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేశారు. దాదాపు రూ.350 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, వెంటనే నిధులు ఇవ్వాలని ప్రతిపాదించారు. తాత్కాలిక పనులకు రూ.20 కోట్లు మినహాయించి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. విపత్తు సాయం అందించాలని ప్రజలు కోరుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

కేంద్రం కరుణించేనా..?

వరదలతో నష్టపోయిన కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఈ నెల 8న కేంద్ర బృందం పర్యటించింది. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం కేంద్ర మంత్రులను కలిసి నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని కోరారు. దీంతో కేంద్రం నుంచి సాయం అందుతుందని ప్రజలు భావించారు. అయితే కేంద్ర ప్రభుత్వం సైతం వరద సాయంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరదలతో నష్టపోయిన వారికి సాయం అందించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవిత రాజీనామాను ఆమోదించండి

అక్షరటుడే, ఇందూరు: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామాను వెంటనే ఆమోదించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఆమె మంగళవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన రాజీనామాను ఆమోదించాలని కల్వకుంట్ల కవిత ఈ ఏడాది సెప్టెంబర్ 3న మండలి ఛైర్మన్‌కు ఫార్మాట్‌లో లిఖితపూర్వకంగా లేఖ రాశాన్నారు. దాదాపు రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ ఛైర్మన్ నిర్ణయం తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికీ తెలంగాణ శాసనమండలి అధికారిక వైబ్‌సైట్‌లో ఆమెను ఎమ్మెల్సీగానే చూపిస్తున్నారని.. ఇంకా రాజీనామాను ఆమోదించలేదని వెల్లడించారు.

స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పటికీ..

తెలంగాణ శాసన మండలి ప్రవర్తన నియమావళి నెం.190 కింద సూచించబడిన ఫార్మాట్ కింద ఎమ్మెల్సీ కవిత రాజీనామా సమర్పించినప్పటికీ ఛైర్మన్ ఆమోదించకపోవడంపై ఆంతర్యమేమిటో తెలియడం లేదని స్రవంతిరెడ్డి పేర్కొన్నారు. అయితే ఛైర్మన్ విచారణ సమయంలో రాజీనామా స్వచ్ఛందంగా లేదా నిజమైనది కాదని నిరూపిస్తేనే తిరస్కరించవచ్చని సుప్రీంకోర్టు సైతం స్పష్టంగా పేర్కొందన్నారు. అయితే ఎమ్మెల్సీ స్పష్టంగా రాజీనామా సమర్పించినందున రాజీనామాను ఆమోదించడం తప్ప వేరే మార్గమే లేదన్నారు. కవిత సైతం తన రాజీనామా లేఖను సమర్పించే ముందు విలేకరుల సమావేశం నిర్వహించి, ఆమె తన స్వేచ్ఛా సంకల్పంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. తక్షణమే ఆమె రాజీనామాను ఆమోదించాలని శాసన మండలి ఛైర్మన్‌ను కోరారు.

గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపండి

అక్షరటుడే, ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లట్లేదని.. ఆయా గ్రామాల్లో బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కోరారు. ఈ మేరకు మంగళవారం టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని హైదరాబాద్ లోని బస్ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బస్సుల కొరత, గ్రామీణ ప్రాంతాలకు తగిన సర్వీసులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గానికి కొత్త బస్సులను కేటాయించాలని.. ఎల్లారెడ్డి పట్టణంలో కొత్త ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలని కోరారు.

అలాగే గ్రామీణ మార్గాల్లో సర్వీసులను పెంచి.. ఫ్రీ క్వెన్సీ మెరుగుపర్చాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఎల్లారెడ్డికి 10 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించినందుకు ఆర్టీసీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్పందించిన ఎండీ నాగిరెడ్డి ఎల్లారెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తడిసిన ధాన్యం పరిశీలన

అక్షరటుడే, బాన్సువాడ: వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నందున కేంద్రాల్లో కొనుగోళ్ల వేగం పెంచాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్ మండలం కిష్టాపూర్, చించోల్లి, బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తడిసిన రైతులతో మాట్లాడారు. అనంతరం డీఎస్‌వోతో ఫోన్‌లో మాట్లాడి లారీల కోసం ఎదురుచూడకుండా తూకంవేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్లు కూడా ధాన్యం బస్తాలు మిల్లుకు చేరగానే తక్షణమే దింపుకొని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, తూకం వేసిన బస్తాలు, ధాన్యం రాశులపై పాలిథీన్ కవర్లు కప్పి రక్షించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి

అక్షరటుడే, కామారెడ్డి : వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సెంటర్ల ఇన్‌ఛార్జీలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సదాశివనగర్‌తో పాటు ఉప్పల్ వాయిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. రైతులు నష్టపోకుండా, ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో పాటు అవసరమైన సౌకర్యాలు వెంటనే కల్పించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో వేగం పెంచాలని ఆయన ఆదేశించారు. వెంట వెంటనే డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీఆర్వో మదన్ మోహన్, డీసీవో రామ్మోహన్, క్లస్టర్ ఆఫీసర్ లక్ష్మణ్, ఇతర అధికారులు ఉన్నారు.

31 నుంచి 'యూనిటీ మార్చ్': ఎంపీ అర్వింద్

అక్షరటుడే, ఇందూరు: భారత యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు జిల్లాలో యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్లు ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ప్రజలు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పటేల్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

జిల్లాలో పాదయాత్ర..

జిల్లాలో పాదయాత్ర అక్టోబర్ 31న ప్రారంభమవుతుందని 'మై భారత్' కేంద్రం కో-ఆర్డినేటర్ శైలి బెల్లాల్ తెలిపారు. అలాగే మై భారత్ పోర్టల్‌లో అనేక అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారికి నవంబర్ 26 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

మున్సిపాలిటీలకిచ్చిన నిధులు 80శాతం కేంద్రానివే..

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, డ్రింకింగ్ వాటర్ కోసం ఇటీవల రూ.2,332 కోట్లు నిధులు విడుదల చేశారని ఎంపీ తెలిపారు. ఇందులో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని ఆరు

మున్సిపాలిటీలకు రూ.169.3 కోట్లు విడుదలయ్యాయన్నారు. అయితే ఇందులో 80శాతం నిధులు కేంద్రానివేనని, 20శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానివని వెల్లడించారు.

దీక్ష కోసం ప్రణాళిక..

జిల్లాలోని ఆర్‌వోబీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని అర్వింద్ డిమాండ్ చేశారు. గతంలో తాను చెప్పిన విధంగా తొందర్లోనే మాధవ నగర్ ఆర్‌వోబీ వద్ద దీక్షకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిజామాబాద్‌లో బీజేపీకి మంచి పట్టు ఉందని, జూబ్లీహిల్స్‌లో కార్యకర్తలు కూడా బీజేపీ కోసం కష్టపడుతున్నారన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పసుపు బోర్డు జాతీయ ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

అక్షరటుడే, ఇందల్వాయి: భూ భారతి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. డిచ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహశీల్దార్, ఇతర సిబ్బందితో భూ భారతి అమలుపై సమీక్షించారు. నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. సాదాబైనామా, పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టంచేశారు. రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్ర కుమార్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, తహశీల్దార్ సతీష్, స్థానిక అధికారులు ఉన్నారు.

హరీష్ రావును పరామర్శించిన జిల్లా నేతలు

అక్షర టుడే, ఆర్మూర్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మంగళవారం మృతి చెందారు. దీంతో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, ఆర్మూర్, బోధన్ మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, షకీల్ హరీష్ రావును హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పరామర్శించారు. అనంతరం సత్యనారాయణ రావు మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్లను శుభ్రం చేయించిన మాజీ జెడ్పీటీసీ

అక్షరటుడే, బీర్కూర్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ సేవా దృక్పథంతో ముందుకొచ్చారు. ఆయన స్వగ్రామం మల్లాపూర్ చెరువు కట్ట నుంచి బైరాపూర్ చెరువు కట్ట వరకు, బైరాపూర్ చెరువు కట్ట నుంచి బస్వాపూర్ చెరువు కట్ట వరకు, మల్లాపూర్ నుంచి తిమ్మాపూర్ వరకు రహదారిపై రెండు ట్రాక్టర్లు, జేసీబీ సహాయంతో ముళ్ల పొదలను తొలగించారు. మొరం వేయించి పనులు స్వయంగా సొంత ఖర్చులతో చేయించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. బీర్కూర్ మండల ప్రజలకు ఇబ్బంది వచ్చినా సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

బీర్కూర్ ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

అక్షరటుడే, బీర్కూర్: బీర్కూర్ ఎంపీడీవోగా శ్రీనిధి మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ 1లో సాధించిన ర్యాంక్ ఆధారంగా తొలి నియామకంలో భాగంగా ఎంపీడీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. మండల అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని శ్రీనిధి తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకు అనుమతివ్వాలి

అక్షర టుడే,ఇందల్వాయి: తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న లా సీట్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రమావత్ లాల్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యా శాఖ మండలి ఛైర్మన్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న లా సీట్లను భర్తీ చేయడంతో నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతంలో లా చదువుకునే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. దీనికి ఉన్నత విద్యా శాఖ మండల ఛైర్మన్ సానుకూలంగా స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఈవ్ టీజింగ్‌కు గురైతే షీ టీంకు సమాచారమివ్వండి

అక్షరటుడే, బాల్కొండ: మహిళలు, యువతులు ఈవ్ టీజింగ్‌కు గురైతే వెంటనే షీటీం పోలీసులకు సమాచారమివ్వాలని షీటీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సైబర్ నేరాలు, డయల్ 100, పోక్సో చట్టం, తదితర సేవలపై వివరించారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. షీ టీం ఫోన్ నెంబర్ 8712659795, డయల్ 100 ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రసీదుద్దీన్ అస్లాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సదా మురళి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు

అక్షరటుడే, కామారెడ్డి: వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రాజంపేట మండలం అన్నారం తండాలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే వారిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో తండాకు చెందిన మాలోత్ దీప్లా, సంగీత, వినోద్, ధర్మిలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108 అంబులెన్స్ లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలో కాలం చెల్లిన బస్సులు ప్రజలకు తలనొప్పిగా మారాయి. పల్లె వెలుగు నుంచి ఎక్స్ ప్రెస్ వరకు చాలా బస్సులు తరచూ సాంకేతిక లోపాలతో నిలిచిపోతున్నాయి. పాత ఇంజిన్లు, మరమ్మతులు చేయించని బస్సులు మార్గమధ్యలోనే మొరాయించడం సాధారణమైపోయింది. దీంతో ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరలేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు రాత్రి వేళల్లో ఇబ్బంది అవుతోంది.

–అక్షరటుడే, బాన్సువాడ

కాలం చెల్లిన బస్సులతో అవస్థలు

తరచూ సాంకేతిక లోపాలు | **ప్రయాణికులకు ఇబ్బందులు**

బాన్సువాడ డిపోలో ప్రస్తుతం 74 ప్రభుత్వ బస్సులు, 16 ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. 41 పల్లె వెలుగు, 22 ఎక్స్‌ప్రెస్, 5 డీలక్స్, 4 సూపర్ లగ్జరీ, 2 సెమి డీలక్స్ బస్సులున్నాయి. ఇవి ప్రతిరోజు బాన్సువాడ నుంచి పిట్లం, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, సికింద్రాబాద్ రూట్లలో తిరుగుతున్నాయి. ముఖ్యంగా పల్లె వెలుగు బస్సులు గ్రామీణ ప్రాంతాలకు ప్రధాన రవాణా మార్గం. అయితే వాటిలో చాలా బస్సులు పదేళ్లకు పైగా సేవలందిస్తున్నవి, పాత వాహనాలే కావడంతో తరచూ ఇంజిన్, బ్రేక్, రేడియేటర్, టైర్ వంటి లోపాలు తలెత్తుతున్నాయి.

మచ్చుకు కొన్ని..

గతంలో బాన్సువాడ డిపోకు ఇతర డిపోల్లో వాడిన బస్సులను కేటాయించారు. అవే బస్సులు ప్రస్తుతం తిరుగుతున్నాయి. దీంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కువ కిలోమీటర్లు పయనించిన బస్సులు సాంకేతికంగా బలహీనమై ఉండటంతో రోడ్డుపై నిలిచిపోయే ఘటనలు తరచూ జరుగుతున్నాయి.

- బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డి వెళ్తున్న బస్సు మార్గ మధ్యలో ఇంజిన్ ఆగిపోయి గంటపాటు వేచిచూడాల్సి వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం క్రితం పల్లె వెలుగు బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో బాన్సువాడ శివారులో డ్రైనేజీని ఢీకొట్టి బస్సు ముందు భాగం రెండు టైర్లు ఊడిపోయాయి.
- ప్రయాణికుల భద్రత, సమయపాలన దృష్ట్యా ప్రభుత్వం కొత్త బస్సులను కేటాయించాల్సిన అవసరం ఉంది. పాత వాహనాలను దశలవారీగా తొలగించి పల్లె వెలుగు సర్వీసులకు ఆధునిక బస్సులను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

కిట్స్‌లో అలరించిన ఫ్రెషర్స్ పార్టీ

అక్షరటుడే, ఇందూరు: కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (కిట్స్) ఫ్రెషర్స్ పార్టీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఉత్తమంగా విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఫ్రెషర్స్‌పార్టీ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. విద్యార్థినులు వెస్టర్న్, క్లాసికల్ డ్యాన్సులు చేశారు. విద్యార్థినుల ర్యాంప్‌వాక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సెల్వరాజ్, వైస్ ప్రిన్సిపాల్ సాయారెడ్డి, సిబ్బంది వేణు గోపాల్ పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో..

అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 'ఫ్రెషర్స్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ నవీన్ యాదవ్, పరిపాలన అధికారి రాకేష్, అధ్యాపకులు బాలరాజ్, అరవింద్, రాజశేఖర్, రజనీకాంత్, ప్రమోద్, శ్రీధర్, అర్చన, సుమలత, నవనీత, నిఖిత, అపూర్వ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని బాచన్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ గజాల రఘుపతి మంగళవారం ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంతరావు, వేముగంటి ప్రాజెక్టు ఛైర్మన్ ఎనుగంటి రాజేశ్వర్, క్రాంతి, వంశీ, గాండ్ల బాలయ్య, బండారి వినోద్, బండారి లింబాద్రి, వీడీసీ సభ్యులు గౌతం తదితరులు పాల్గొన్నారు.

నాగపూర్‌లో పశు వైద్య శిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని నాగపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 298 పశువులకు (ఆవులు, గేదెలు) ఉచితంగా టీకాలు వేశారు. మిగిలిన పశువులకు బుధవారం టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి గౌతమ్ రాజు, ప్రవీణ్, ప్రణీత్, గోపాలమిత్ర మల్లేశ్, షకీల్, గ్రామస్థులు బొడ్డు మనిత్, బి. నర్సయ్య, బషీర్ గంగాధర్, చమన్ చిన్నయ్య, ఎంబారి చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లో బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి పుణ్య రాజు ఆధ్వర్యంలో 20 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో మోతి బిందు సమస్య ఉన్న రోగులను గుర్తించారు. అనంతరం వారికి అవసరమైన శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కార్యదర్శి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో ఇక్కట్లు

అక్షరటుడే, ఆర్మూర్ : ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ రోడ్డు అధ్వానంగా మారింది. గుమ్మిర్యాల నుంచి నాగేంద్ర నగర్ కు వెళ్లే దారిపై భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గుంతలతో ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. మంగళవారం సైతం ఆర్మూర్ కు చెందిన ఆటో ప్రయాణికులతో వస్తుండగా గుంతలకు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్లు అధ్వానంగా తయారైనా.. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

బాన్సువాడ మండలంలోని కోనాపూర్‌లో..

అకాల వర్షాలు అన్నదాతను కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తున్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వర్షాల కారణంగా ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. నియోజకవర్గంలోని బీర్కూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో, ఇందల్వాయి మండలంలో, కామారెడ్డి పట్టణంలో కురిసిన భారీవర్షం కారణంగా ధాన్యం పూర్తి తడిసిపోయింది. రోడ్లపై, కల్లాల్లో ఆరబెట్టిన పంట తడిసిపోయింది. ఆర్నెళ్లు కష్టపడి పండించిన పంట రాత్రికిరాత్రే వర్షార్పాణమైందని రైతులు ఆవేదన చెందారు. తడిసిన ధాన్యం మార్కెట్‌లో కొనుగోలు చేయకపోతే తమకు తీవ్రనష్టం వాటిల్లుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

– అక్షరటుడే,
బాన్సువాడ/ఇందల్వాయి/ కామారెడ్డి

ఇందల్వాయి మండలంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

కామారెడ్డి పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో..